నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 13 జూలై 2024 | SURYAPET

కోదాడలో కోర్టు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్జిలు

కోదాడ కోర్టు భవనం మోడల్‌గా నిలువాలి

● కోదాడ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్

కోదాడ టౌన్, జూలై 25 : కోదాడలో నూతనంగా నిర్మించే కోర్టు భవనం రాష్ట్రంలోనే మోడల్‌గా నిలువాలని కోదాడ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. శ్యాంసుందర్ అన్నారు. కోదాడ పట్టణంలో 25 కోట్ల రూపాయలతో 4 అంతస్తుల్లో నిర్మిస్తున్న 4 కోర్టు భవన సముదాయాల నిర్మాణ పనులను అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, సెకండ్ క్లాస్ జడ్జి సత్యనారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కోర్టు నిర్మాణంతో కక్షిదారులు, న్యాయవాదులకు మెరుగైన సౌకర్యాలు కలుగుతాయన్నారు. గత కొన్నేళ్లుగా కక్షిదారులు, న్యాయవ్యాదులు ఎదుర్కొంటున్న సమస్యలు తీరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్ల నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల రామిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఎలకా సుధాకర్ రెడ్డి, దేవబత్తిని నాగార్జునరావు, కేఎల్ఎన్ ప్రసాద్, తమ్మినేని హనుమంతరావు, సిలివేరు వెంకటేశ్వర్లు, ఈదుల కృష్ణయ్య, మేకల వెంకట్రావు, బొబ్బ కోటిరెడ్డి, పాలేటి నాగేశ్వర్‌రావు, శరత్ బాబు, రాజారాం, శ్రీదేవి, బార్ అసోసియేషన్ సభ్యులు సరికొండ హనుమంతరాజు, కోడూరు వెంకటేశ్వరరావు, మంద వెంకటేశ్వర్లు, హేమలత, శ్రీధర్, సామా, నవీన్‌కుమార్, షేక్ నాగుల్ పాషా, ధనలక్ష్మి కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులకు గండ్లు పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి

● నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి

కలెక్టరేట్‌లో అర్డీఓలు, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ రూరల్, జూలై 12 : వర్షాల కారణంగా చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా ముందే పటిష్ట చర్యలు తీసుకోవాలని నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆర్డీఓలు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడైనా గండ్లు పడేందుకు అవకాశం ఉన్న చెరువులను గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు. ఒండ్రు మట్టి, మొరం, ఇసుక వంటివి అక్రమ రవాణా జరుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా కంచె వేయించాలని చెప్పారు. వచ్చే శుక్రవారం వరకు కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణ సమస్యలు పరిష్కరించాలని, ప్రాజెక్టుల పనుల్లో పురోగతి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఎఫ్ఓ రాజశేఖర్, ఎస్ఎల్‌బీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజినీర్లు, ఆర్డీఓలు, ఏఈలు, పాల్గొన్నారు.

యువకుల ఘర్షణ కేసులో ముగ్గురి అరెస్ట్

● పరారీలో ఒకరు

సూర్యాపేటలో ఘర్షణ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేట టౌన్, జూలై 12 : అర్ధరాత్రి రోడ్డుపై ఓ యువకుడిని మరో నలుగురు యువకులు దారుణంగా కొట్టిన ఘటన రెండు రోజుల క్రితం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ రవి కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేటలోని నెహ్రూ నగర్‌కు చెందిన ఆది వంశీ అనే యువకుడు ఓ బాలుడిని బెదిరించి కొట్టాడు. అనంతర ఆ బాలుడి తన బాబాయ్ అయిన పిడమర్తి ప్రభుకు విషయం చెప్పడంతో ప్రభు అతని సన్నిహితులైన పిడమర్తి రాంచరణ్, కొండ ప్రదీప్, వెలుగు వినయ్‌తో కలిసి నిర్మల హాస్పిటల్ సమీపంలో ఆది వంశీని ఇష్టం వచ్చినట్లు చేతులతో కడుపులో గుద్దుతూ ఇటుకలతో కొట్టారు. వెంటనే వారందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై బాధితుడు ఆది వంశీ తల్లి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించాం. సాయంత్రం 6 గంటల సమయంలో పక్కా సమాచారం మేరకు అంబేద్కర్ నగర్ వద్ద గల కొత్త వ్యవసాయ మార్కెట్‌లో నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించాం. ఈ కేసులో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకోగా మరో యువకుడు వెలుగు వినయ్ పరారీలో ఉన్నాడు. నిందితుల్లో ఎవరికీ గతంలో గానీ ఇప్పుడు గానీ గంజాయి సేవించే అలవాటు లేదని తెలిపారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన సీఐ రాజశేఖర్, ఎస్ఐలు మహేంద్ర నాథ్, బాలకృష్ణ, క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, కరుణాకర్, సైదులు, కానిస్టేబుల్ ఆనంద్, మధును డీఎస్పీ రవి అభినందించారు.

రసాయన పరిశ్రమలో గ్యాస్ లీకై కార్మికులకు అస్వస్థత

గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రికి తరలించిన యాజమాన్యం

హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికులు

చౌటుప్పల్ రూరల్, జూలై 12 : చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలోని శ్రీజయ ల్యాబోరేటరీస్ లిమిటెడ్ ప్రైవేట్ పరిశ్రమలో బుధవారం ఉదయం 11.45 నిమిషాలకు డై మిథైల్ సల్ఫేడ్ గ్యాస్ లీక్ కావడంతో పరిశ్రమలోని పలువురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. పరిశ్రమ వర్గాలు సంఘటనను గుట్టుచప్పుడు కాకుండా కార్మికులను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కొంత మందికి స్వల్ప అస్వస్థత ఉండగా చికిత్స నిర్వహించి డిశ్చార్జ్ చేశారు. ఐదుగురు కార్మికులు కంటి, తీవ్ర శ్వాస సంబంధ సమస్యతో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

కార్మికుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు

పరిశ్రమలో ప్రమాదం జరిగిందని అస్వస్థతకు గురైన కార్మికుడు నేలపట్ల రాంబాబు భార్య నేలపట్ల గౌతమి ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తన భర్త రాంబాబు బుధవారం ఉదయం ఆరు గంటలకు డ్యూటీకి వెళ్లగా తన భర్తతో పాటు మరికొందరు ఉద్యోగులు పరిశ్రమలో గ్యాస్ లీక్ కావడంతో శ్వాస సమస్యతో స్పృహ తప్పి పడిపోయారని, ఆ తర్వాత వారిని ఆస్పత్రికి తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొంది. చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఆయన చెప్పారు.

నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు రాజధాని బస్సు

నేడు ప్రారంభించనున్న మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం

నల్లగొండ సిటీ, జూలై 12 : నల్లగొండ డిపో నుంచి హైదరాబాద్‌కు నూతన బస్సు రాజధాని సర్వీస్‌ను శనివారం ఉదయం 11 గంటలకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్న ప్రభాకర్ ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని బస్సు నల్లగొండ నుంచి ప్రతి రోజూ ఉదయం 5 గంటలకు హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి హైదరాబాద్ నుంచి ఉదయం 10.30 గంటలకు నల్లగొండకు వస్తుందని పేర్కొన్నారు. నల్లగొండ నుంచి తిరిగి ఉదయం 11.30 హైదరాబాద్ వెళ్తుందని, నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు టికెట్ ధర రూ. 260 ఉంటుందని తెలిపారు. దాంతోపాటు నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు మరో నాలుగు నాన్‌స్టాప్ బస్సులను ప్రారంభించన్నారని, ఈ కార్యక్రమానికి ఆర్టీసీ ఉద్యోగులు, వెల్ఫేర్ కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

గౌరెల్లి-భద్రాచలం హైవేకు భూ సేకరణ

భూములు ఇవ్వడంపై రైతుల అనాసక్తి

● బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.80 లక్షలు..
● ప్రభుత్వం ఇచ్చేది రూ.24 లక్షలు

భూదాన్ పోచంపల్లిలో భూ నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జూలై 12 : రంగారెడ్డి జిల్లా గౌరెల్లి నుంచి భద్రాది కొత్తగూడెం వరకు చేపడుతున్న జాతీయ రహదారి -930 నిర్మాణంలో భాగంగా భూసేకరణకు జాతీయ రహదారుల సంస్థ ఈ నెల 6న నోటిఫికేషన్ జారీ చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ డివిజన్ పరిధిలో గల వలిగొండ, భూదాన్ పోచంపల్లి మండలాల్లో భూ సేకరణ చేయనున్నారు. ఇందుకోసం భూదాన్‌పోచంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో భూ నిర్వాసితులు, రైతులతో సమావేశమై అధికారులు అభిప్రాయాలు అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. జాతీయ రహదారి -930 తో పిలిచే ఈ రహదారి హైదరాబాద్ నుంచి భద్రాది కొత్తగూడెం వరకు అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం కేంద్రం రూ.675.45 కోట్లు ఇప్పటికే విడుదల చేసింది. పోచంపల్లి, వలిగొండ, మోత్కూర్, అడ్డగూడూరు మీదుగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ నుంచి భద్రాది కొత్తగూడెం వరకు జాతీయ రహదారి చేయనున్నారు. రంగారెడ్డి జిల్లా గౌరెల్లి నుంచి యాదాద్రి జిల్లాలో సుమారు 42 కిలోమీటర్ల మేర కొత్త రోడ్డును నిర్మించనున్నారు. 150 ఫీట్ల వెడల్పుతో నిర్మించే ఈ రోడ్డు యాదాద్రి జిల్లాలో సుమారు 37 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ప్రస్తుతం ఉన్న రోడ్లతో సంబంధం లేకుండా పూర్తిగా నూతన రోడ్డుకు ప్రతిపాదించారు. ఆయా గ్రామాల మీదుగా కొత్త రోడ్డు నిర్మాణంతో మరో జాతీయ రహదారి ప్రజలకు అందుబాటులో రానున్నది. ఆయా గ్రామాలకు వెళ్లకుండా పూర్తిగా బైపాస్ వేయనున్నారు. తాజాగా గౌరెల్లి -భద్రాది కొత్తగూడెం రోడ్డుతో జిల్లాలో రవాణా వసతులు మెరుగుపడనున్నాయి. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా జాతీయ రహదారులు నిర్మిస్తున్నారు. జాతీయ రహదారులతో భూములు ధరలు పెరగడం, కొత్త పరిశ్రమలు రావడం, ప్రయాణ దూరం తగ్గడంతో పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి కానున్నాయి.

ఎకరాకు రూ.24 లక్షలు ఇస్తే ఎట్ల?

మూసీ పరీవాహ ప్రాంతంలో రైతులకు వ్యవసాయమే జీవనాధారం. తనకున్న భూమిలో పంటలు పండించుకొని జీవిస్తున్నారు. జాతీయ రహదారుల కోసం భూములు ఇవ్వడానికి రైతులు సిద్ధంగా లేరు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఒక ఎకరానికి రూ.80 లక్షలు విలువ చేస్తే ప్రభుత్వం రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం ఎకరాకు రూ.24 లక్షలు మాత్రమే ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం విలువ ప్రకారం ఇచ్చే పరిహారం తమకు గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు. ఎకరానికి ప్రభుత్వం రూ.24 లక్షలు ఇస్తే 10 గుంటల భూమి కూడా రావడం లేదని, రెండెకరాలు భూమిని ఇస్తే మేం బతికేది ఎట్లా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్ ప్రకారం రేటును ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే భూమిని ఇవ్వమని రైతులు తేల్చి చెబుతున్నారు.

భూమిని సేకరించనున్న గ్రామాలు

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు గౌరెల్లి నుంచి భద్రాది కొత్తగూడెం వరకు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గౌరెల్లి-వలిగొండ సెక్షన్‌లో 455 ఎకరాలు భూమిని సేకరించనున్నారు. చౌటుప్పల్ డివిజన్ పరిధిలో భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లి, కనుముక్కుల, దంతూరు, వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి, జగత్‌పల్లి, జూలూరు, పిలాయిపల్లి, పోచంపల్లి, మేహర్‌నగర్, వలిగొండ మండలంలో లోతుకుంట, మల్లెపల్లి, పొద్దుటూరు, రెడ్లరేపాక, సంగెం గ్రామాల్లో రోడ్డు విస్తరణ వెడల్పు కోసం అవసరమైన భూమికోసం నోటిఫికేషన్ వేశారు. మండలంలో చౌటుప్పల్ ఆర్డీఓ, తాసిల్దార్ సమక్షంలో రైతులతో సమావేశం పరిచి అభిప్రాయం అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. నోటిఫికేషన్ వచ్చిన 21 రోజుల్లోపు చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో రైతులు తమ అభ్యంతరాలు తెలుపాలని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, మండల తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఎకరాకు రూ. 24.50 లక్షలు పరిహారం

● చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

గౌరెల్లి -భద్రాది కొత్తగూడెం జాతీయ రహదారి నిర్మాణంలో భూ నిర్వాసితులకు ప్రభుత్వం మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి రూ.24.50 లక్షల నష్టపరిహారం చెల్లిస్తుందని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి తెలిపారు. భూదాన్ పోచంపల్లిలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కనుముకుల, దంతూరు గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులతో ఆయన సమావేశం నిర్వహించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నామని, ఒక్క ఎకరం, రెండెకరాల సన్న, చిన్న కారు రైతులు భూమిని ఇస్తే జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో కనుముక్కుల గ్రామంలో 79 మంది రైతుల నుంచి 26.15 ఎకరాలు, దంతూరు గ్రామంలో 38 మంది రైతుల నుంచి 25 ఎకరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఎకరానికి 24.50 లక్షలు చెల్లిస్తుందని చెప్పారు. ఏవైనా అభ్యంతరాలున్నా, నష్టపరిహారం ఎక్కువ కావాలన్నా కలెక్టర్‌కు విన్నవించుకోవచ్చని తెలిపారు. రైతుల అభ్యంతరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటయ్య, సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌శర్మ, ఎంఆర్ఐ గుత్తా వెంకటరెడ్డి, మండల సర్వేయర్ సాయికుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, మాజీ సర్పంచులు కోట అంజిరెడ్డి, దోటి కుమార్, నాయకులు కోట రామచంద్రారెడ్డి, కొండల్‌రెడ్డి, లింగస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

● సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి
● సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

గరిడేపల్లి : గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో పాఠం బోధిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

గరిడేపల్లి, జూలై 12 : వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గరిడేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలోని రికార్డులను పరిశీలించి పలు విషయాలపై ఆరా తీశారు. దవాఖానలో లేని సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. దవాఖాన ఆవరణను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దవాఖానకు వచ్చే వారికి సరైన పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా మందులు అందించాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను బోధించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ విద్యార్థులను క్రమశిక్షణతో నడుచుకునేలా చేయాలన్నారు. అలాగే తాసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి తాసీల్దార్‌ను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను సైతం పరిశీలించారు. ఆ తర్వాత ఎంపీడీఓ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజాపాలన సహాయ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ బి.కవిత, ఇన్‌చార్జి ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

అధ్యాపకుడైన కలెక్టర్

గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాలను శుక్రవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. పాఠశాల వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం ఇంటర్మీడియట్ ఫస్టియర్ తరగతి గదిలో ఫిజిక్స్ అధ్యాపకుడు రవీందర్‌నాయక్ పాఠం బోధిస్తుండగా ఆ తరగతి గదిలోకి వెళ్లి బోధిస్తున్న పాఠానికి సంబంధించిన పలు విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చాక్‌పీస్ పట్టి బోర్డుపై రాస్తూ వేగం, త్వరణం, స్థానభ్రంశంపై 35 నిమిషాలపాటు బోధించారు. అలాగే ఫిజిక్స్‌లోని ఓ ప్రాబ్లమ్‌ను చేసి విద్యార్థులకు స్వయంగా వివరించారు. ఫార్ములాలను తేలికగా గుర్తించుకునే విధానాల గురించి చెప్పారు. కలెక్టర్ అధ్యాపకుడై పాఠం బోధించడంతో విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. సమస్యలపై పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీర బాబు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రహదారులపై వాహనాలు నిలిపితే కేసు

● సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్, జూలై 12 : రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలో ఎప్పటికప్పుడు ప్రణాళికతో పనిచేస్తున్నామని.. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అజాగ్రత్తతో ఎక్కడ పడితే అక్కడ రోడ్డు వెంట పార్కింగ్ చేసిన వాహనాలే కారణమవుతున్నాయని పేర్కొన్నారు. రహదారుల వెంట ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆపితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఆరు నెలలుగా రోడ్డు వెంట ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన 12,955 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, సిబ్బంది అప్రమత్తంగా ఉండి రోడ్డు నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చేయాలని ఆదేశించారు.

8 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు

● ముందస్తు సమాచారం లేకుండా సెలవులు
● సూర్యాపేట కలెక్టర్ ఆదేశాలతో డీఈఓ చర్యలు

సూర్యాపేట అర్బన్, జూలై 12 : సూర్యాపేట జిల్లాలోని ఆరుగురు హెడ్మాస్టర్లు, ఇద్దరు ఎస్టీటీలకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం పెన్‌పహాడ్, గరిడేపల్లి మండలాల్లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మునగాల, చిలుకూరు, మఠంపల్లి, జాజిరెడ్డిగూడెం మండలాల్లో డీఈఓ అశోక్ పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం ముందస్తు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా సెలవులు తీసుకోవడంతో వారికి నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ తెలిపారు. నోటీసులు వచ్చిన హెడ్మాస్టర్లలో షేక్ దస్తగిరి(జడ్పీహెచ్ఎస్ ఆకుపాముల, మునగాల), కె.రాంరెడ్డి (జడ్పీహెచ్ఎస్ ఆచార్యుల గూడెం, చిలుకూరు), పి.గోవిందయ్య(జడ్పీహెచ్ఎస్ కోమరబండ, కోదాడ), ఎం.శేషిరెడ్డి (జడ్పీహెచ్ఎస్ అల్లీపురం,మఠంపల్లి), కె.కృష్ణారెడ్డి (జడ్పీహెచ్ఎస్ కుక్కడం, మద్దిరాల), బి.నరేందర్(సింగిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల, పెన్‌పహాడ్).. ఎస్టీ జీలలో శ్రీనివాస్(సింగిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల, పెన్‌పహాడ్), ఎ.అపరిజితరెడ్డి, ఉయ్యాలవాడ ప్రాథమిక పాఠశాల, జాజిరెడ్డి గూడెం) ఉన్నారు. నోటీసులు అందుకున్న వారు మూడు రోజుల్లో ఉన్నతాధికారుల ఎదుట వివరణకు హాజరుకావాల్సి ఉంది.

ఉద్దీపనతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

నకిరేకల్ : పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

● ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
● నకిరేకల్‌లో ఉద్దీపన వీవీఎం ఎయిడెడ్ పాఠశాల ప్రారంభం
● పాల్గొన్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు వీరేశం, జీఎల్ఆర్

నకిరేకల్, జూలై 12 : ఉద్దీపనతో పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందుతుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. నకిరేకల్ పట్టణంలోని ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్దీపన వీవీఎం ఎయిడెడ్ పాఠశాలను కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఎంపీ ప్రారంభించారు. జ్యోతిప్రజ్వలన అనంతరం వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్న పిల్లలకు విద్యను అందించడమే ఉద్దీపన ఉద్దేశమని, సామాన్య కుటుంబంలో పుట్టి గొప్ప ఆలోచనలు చేస్తున్న ఎమ్మెల్యే వీరేశానికి అభినందనలు తెలిపారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే ఉద్దీపన ముఖ్య ఉద్దేశమన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక విద్య మంచి భవిష్యత్‌ను అందిస్తుందని, క్రమశిక్షణకు ఒక పునాదిగా నిలుస్తుందన్నారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, డీఈఓ భిక్షపతి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ పూలరవీందర్, ఉద్దీపన చీఫ్ అడ్వయిజర్లు ఆనంద్, మంగారెడ్డి, హెచ్ఎం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు జాబ్ మేళా

రామగిరి, జూలై 12: ఇంటర్మీడియట్ వృత్తి విద్య కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఈ నెల 15న ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ ఆర్. దస్రూనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందని చెప్పారు. 2021-22, 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం పారామెడికల్ కోర్సులకు, మధ్యాహ్నం నాన్ పారామెడికల్ కోర్సులకు జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు.

డీఈడీ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫీజు చెల్లింపునకు 25 వరకు గడువు

రామగిరి, జూలై 12 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని డైట్‌తోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డీఈడీ కళాశాలల్లో 2022-24 విద్యా సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫీజును ఈ నెల 25లోగా చెల్లించాలని డైట్ ప్రిన్సిపాల్ కె.నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 అపరాధ రుసుముతో ఆగస్టు 1లోగా చెల్లించాలని తెలిపారు.

ముగిసిన చెస్ పోటీలు

రామగిరి, జూలై 12: నల్లగొండలోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన కేవీఎస్ రీజినల్ చెస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు ఆ విద్యాలయ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు బహుమతులు, ప్రశంసా పత్రాల